
శుక్రవారం,ఏప్రిల్ 12, 2024

సినాదం

నిఖార్సైన జర్నలిజం

4 PM

Smart Edition



## రేవంత్ రెడ్డి మైక్ వీరుడు..

రంగారెడ్డి : తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి మైక్ వీరుడంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. మైక్ పట్టుకుంటే ఆయనకు పూనకం వచ్చి.. ఏది పడితే అది మాట్లాడుతాడు అని పేర్కొన్నారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన భువనగిరి పార్లమెంట్ విస్తృతస్థాయి సమావేశంలో కేటీఆర్ పాల్గొని ప్రసంగించారు.

04

Kavitha Liquor Scam

# కవిత దందాలు!



### బయటపెట్టిన సీబీఐ.. వామ్మో ఇలా చేశారా!?

ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో బీఆర్ఎస్ నాయకురాలు, ఎమ్మెల్సీ కవిత పాత్ర ఏంటో క్షుణ్ణంగా వెల్లడించింది సీబీఐ ఈ కుంభకోణంలో విస్తుగొలిపే మరిన్ని నిజాలను బహిర్గతం చేసింది సీబీఐ. కవితే రూ. 100 కోట్లు చెల్లించినట్లు సీబీఐ కస్టడీ రిపోర్ట్‌లో పేర్కొంది. శరత్ చంద్రారెడ్డి . కవిత జాగృతి సంస్థకు రూ. 80 లక్షల ముడుపులు చెల్లించినట్లు సీబీఐ తెలిపింది. డబ్బుల కోసం శరత్ చంద్రారెడ్డిని కవిత బెదిరించారని సీబీఐ వెల్లడించింది. ల్యాండ్ డీల్ చేసుకోకపోతే తెలంగాణలో బిజినెస్ ఎలా చేస్తావో చూస్తానని శరత్ చంద్రారెడ్డిని కవిత బెదిరించినట్లు కస్టడీ రిపోర్ట్‌లో పేర్కొన్నారు. అసలు భూమే లేకుండా వ్యవసాయ భూమి కొనుగోలు చేసినట్లు అగ్రిమెంట్లు, రిజిస్ట్రేషన్ పత్రాలు సృష్టించారంది.

నకిలీ భూ విక్రయం పేరుతో శరత్ చంద్రారెడ్డి నుంచి రూ. 14 కోట్లు కవిత తీసుకున్నారని సీబీఐ ఆరోపించింది. ఢిల్లీ లిక్కర్ బిజినెస్‌కు పరిచయం చేసినందుకు కవితకు చెందిన తెలంగాణ జాగృతి సంస్థకు శరత్ చంద్రారెడ్డి రూ. 80లక్షలు చెల్లించారట. మహబూబ్ నగర్‌లో వ్యవసాయ భూమి ఉందని, దాన్ని కొనుగోలు చేసినట్లు రూ. 14 కోట్లు ఇవ్వాలని శరత్ చంద్రారెడ్డిని కవిత డిమాండ్ చేశారట. అసలు ఆ భూమి సంగతి, దాని ధర ఎంతో తెలియనందువల్ల తాను రూ.14కోట్లు ఇవ్వలేని శరత్ చంద్రారెడ్డి చెప్పారట. కానీ, రూ. 14 కోట్లు ఇవ్వకపోతే తెలంగాణలో అరబిందో ఫార్మా బిజినెస్ ఉండదని కవిత బెదిరించారని సీబీఐ తన కస్టడీ రిపోర్ట్‌లో పేర్కొంది.

ఒక్కో రిటైల్ జోన్‌కి రూ.5 కోట్లు చెప్పున 5 రిటైల్ జోన్‌లకు రూ.25 కోట్లు ఇవ్వాలని శరత్ చంద్రారెడ్డిని కవిత డిమాండ్ చేశారట. ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డిని కూడా కవిత రూ. 50 కోట్లు డిమాండ్ చేశారట. తన కుమారుడు మాగుంట రాఘవ ద్వారా కవితకు ఆయన రూ.25కోట్లు చెల్లించారని సిబిఐ ఆరోపించింది. కేజ్రీవాల్ అనుచరుడు విజయనాయర్‌కి కవితే రూ.100కోట్లు చెల్లించారని సీబీఐ తెలిపింది. అలా

ఇండో స్పిరిట్స్‌లో 65శాతం వాటా పొందారట. గోవాకు రూ.44.45 కోట్లు హవాలా మార్గంలో బదిలీ చేశారట. ఈ డబ్బును కవిత పిఏ అశోక్ కౌశిక్ హవాలా డీలర్లకు చేర్చాడట. ఈ విషయాలన్నింటిపైనా కవిత సరైన సమాధానాలు చెప్పడం లేదని.. ఆమెను 5 రోజులు కస్టడీలోకి తీసుకొని మరిన్ని విషయాలను రాబట్టాల్సి ఉందని ప్రత్యేక కోర్టును సీబీఐ కోరింది

## ఎమ్మెల్సీ కవితకు మరోసారి చుక్కెదురు

న్యూఢిల్లీ: ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో మాజీ సీఎం కేసీఆర్ కుమార్తె, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితకు మరోసారి చుక్కెదురైంది. సీబీఐ తనను అరెస్టు చేయడాన్ని సవాలు చేస్తూ దాఖలు చేసిన పిటిషన్‌ను ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టు తోసిపుచ్చింది. సీబీఐ తనను ప్రశ్నించడాన్ని సవాలు చేసిన పిటిషన్‌ను కూడా కోర్ట్ కొట్టివేసింది. ఇక సీబీఐ కస్టడీకి అప్పగించడానికి సంబంధించిన పిటిషన్‌పై తీర్పును కోర్ట్ రిజర్వ్ చేసింది. దీనిపై కాసేపట్లో తీర్పు వెల్లడయ్యే అవకాశం ఉంది. కోర్టు తీర్పు ఎలా ఉండబోతోందనేదానిపై ఉత్కంఠ నెలకొంది.

### ఎన్నికల ప్రచారంలో

## పాల్గొనాలి..

### బెయిల్ ఇవ్వండి : ఢిల్లీ కోర్టుకు సిసోడియా



ఢిల్లీ

మద్యం పాలసీ కేసులో అరెస్టై జైల్లో ఉన్న ఢిల్లీ మాజీ ఉపముఖ్యమంత్రి, ఆప్ నేత మనీశ్ సిసోడియా మరోసారి ఢిల్లీ కోర్టును ఆశ్రయించారు. రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో తనను మధ్యంతర బెయిల్ పై విడుదల చేయాలని ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తన పార్టీ తరఫున ఎన్నికల ప్రచారం చేయడానికి మధ్యంతర బెయిల్ మంజూరు చేయాలని కోర్టును అభ్యర్థించారు. సిసోడియా పిటిషన్‌ను విచారణకు స్వీకరించిన ప్రత్యేక కోర్టు.. ఈడీ, సీబీఐకి నోటీసులు జారీ చేసింది. సిసోడియా అభ్యర్థనపై స్పందన తెలియజేయాలని నోటీసుల్లో పేర్కొంది. అనంతరం విచారణను ఏప్రిల్ 20వ తేదీకి వాయిదా వేసింది.

## నా టార్గెట్

### గజ్వేల్, సిద్దిపేటలో ఇద్దరినీ ఇంటికి పంపుడే



సిద్దిపేట జిల్లా: బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మాజీ మంత్రి హరీష్ రావుపై కాంగ్రెస్ నేత మైనంపల్లి హనుమంతరావు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. తప్పకుండా రాబోయే ఎన్నికల్లో మామ, అల్లుళ్ళలో ఒకరిని తోటపల్లి, ఇంకొరిని చింతమడకకు పంపడం ఖాయమంటూ వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం గజ్వేల్ పట్టణంలో కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో మంత్రి కొండా సురేఖ, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తుంకుంటా నర్సారెడ్డి , మెదక్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నీలం మధు, మైనంపల్లి హనుమంతరావు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మైనంపల్లి మాట్లాడుతూ... “నా టార్గెట్ గజ్వేల్, సిద్దిపేటలో ఇద్దరినీ ఇంటికి పంపుడే” అని స్పష్టం చేశారు. ప్రభుత్వం ఉండి ఎమ్మెల్యేలు లేకపోవడం బాధాకరమన్నారు. నాయకులు మాజీలు అవుతారు కానీ కార్యకర్తలు మాజీలు కారన్నారు. నీలం మధు వార్డు మెంబర్ నుంచి పైస్థాయికి వచ్చిన వ్యక్తి కాబట్టి కార్యకర్తల బాధ తెలుసన్నారు. బీఆర్ఎస్ నాయకులకు డబ్బుల తప్ప కార్యకర్తల బాధలు తెలియవని మండిపడ్డారు. నీలం మధుకు తల్లి, తండ్రి లేరు కాబట్టి మనమే తల్లిదండ్రులమన్నారు. మాటల్లో కాకుండా చేతుల్లో చేద్దామని మైనంపల్లి హనుమంతరావు వెల్లడించారు

### ఫొటో జర్నలిస్టు నర్రా రాజేష్ కుటుంబానికి

## అండగా ఉంటాం : కె శ్రీనివాస్ రెడ్డి



హైదరాబాద్ : యువ ఫొటో జర్నలిస్ట్ నర్రా రాజేష్ ఆకస్మిక మరణం అత్యంత విషాదకరమని, అతని కుటుంబానికి తాము అండగా ఉంటామని తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి భరోసా ఇచ్చారు. శుక్రవారం నాడు బషీర్‌బాగ్‌లోని సురవరం ప్రతాప్ రెడ్డి ఆడిటోరియంలో తెలంగాణ స్టేట్ ఫోటో జర్నలిస్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాజేష్ సంస్మరణ సభ నిర్వహించారు. అసోసియేషన్ నుండి బాధిత కుటుంబానికి లక్ష రూపాయల ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కే శ్రీనివాస్ రెడ్డి మాట్లాడారు.

02



## తెలంగాణకు 8.5 టీఎంసీలు

హైదరాబాద్ : కృష్ణా నదీ యాజమాన్య బోర్డు త్రిసభ్య కమిటీ కీలక నిర్ణయం తీసుకుంది. దాదాపు రెండు గంటలకు పైగా జలసౌధలో కొనసాగిన త్రిసభ్య కమిటీ సమావేశంలో కేవలం తాగునీటి అంశంపైనే చర్చించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో తాగునీటి సమస్యలు రాకుండా.. రెండు రాష్ట్రాల అంగీకారంతో సమాన నీటి వాటాలను త్రిసభ్య కమిటీ పంపిణీ చేసింది.కేఆర్ఎంబీలో ఉన్న మొత్తం నీటి లభ్యత 14 టీఎంసీలు ఉండగా, ఇందులో తెలంగాణకు 8.5, ఏపీకి 5.5 టీఎంసీల నీటిని కేటాయించారు. మే నెలలో మరోసారి తాగునీటి సమస్యలపై త్రిసభ్య కమిటీ భేటీ కానుంది. మే నెలలో జరిగే సమావేశంలో పులిచింతల కృష్ణా అవసరాల కోసం మరోసారి రివ్యూ చేస్తామన్నారు



## 20 ఏళ్ల తర్వాత...

### కలుసుకున్న మల్లికా షరావత్, ఇమ్రాన్ హస్మీ

న్యూఢిల్లీ: ఇమ్రాన్ హస్మీ, మల్లికా షరావత్మ ళ్లీ ఒక్కటయ్యారు. 20 ఏళ్ల బ్రేక్ తర్వాత ఆ ఇద్దరూ హగ్ ఇచ్చుకున్నారు. 2004లో మర్డర్ ఫిల్మ్ షూట్ టైంలో ఈ ఇద్దరి మధ్య గొడవైంది. ఆ తర్వాత ఆ ఇద్దరూ మళ్లీ ఎప్పుడూ కలుసుకోలేదు. అయితే ఫిల్మ్ ప్రొడ్యూసర్ ఆనంద్ పండిట్ కూతురు రిసెప్షన్ వేడుకకు ఆ ఇద్దరూ హాజరయ్యారు. ఒకర్ని చూసి ఒకరు పలుకరించుకున్నారు. హగ్ ఇచ్చుకున్నారు. ఫోటోలకు ఫోజులు ఇచ్చారు. పింక్ డ్రెస్సులో మల్లికా.. బ్లాక్ సూట్‌లో ఇమ్రాన్ హస్మీ తెగ మెరిసిపోయారు. మహేశ్ భట్ నిర్మించిన మర్డర్ చిత్రంలో ఆ ఇద్దరి బాడీ కెమిస్ట్రీ అప్పట్లో ఫుల్ సెన్సేషన్ క్రియేట్ చేసింది.

# భేదాభిప్రాయాలు వీడి పని చేయండి.. మెదక్ మనదే..



**సంగారెడ్డి:** మెదక్‌లో బీసీలకు కాంగ్రెస్ పార్టీ అవకాశం ఇచ్చిందని... ఇతర పార్టీలు బీసీలను పట్టించుకోలేదని మంత్రి కొండా సురేఖ అన్నారు. నేడు పఠాన్ చెరు మండలం గణేష్ గడ్డ గణేష్ దేవస్థానం వద్ద కాంగ్రెస్ ప్రచార రథాలకు పూజలు చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, ఎంపీ అభ్యర్థి నీలం మధు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొండా సురేఖ మాట్లాడుతూ.. మెదక్ గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగరేస్తామన్నారు. ప్రణాళికాబద్ధంగా పార్టీ విజయానికి కృషి చేస్తున్నామన్నారు. పార్టీ శ్రేణులు సైనికుల్లా పనిచేయాలని కొండా సురేఖ పిలుపునిచ్చారు. శాసనసభ ఎన్నికలలో కొంత కమ్యునికేషన్ గ్యాప్‌తో ఇక్కడ ఓటమి పాలయ్యామన్నారు. పొరపాట్లు సాధారణంగా జరుగుతుంటాయని.. వాటిని మనమే పరిష్కారం చేసుకుందామన్నారు. బేషజాలు, భేదాభిప్రాయాలు వీడనాడి పార్టీ గెలుపునకు పనిచేయాలని సురేఖ తెలిపారు. అనంతరం టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి మాట్లాడుతూ.. బీఆర్ఎస్, కాంగ్రెస్‌కు మాత్రమే పోటీ ఉంటుందన్నారు. మేము కొట్టే పంజాలకు ఇతర పార్టీలు గిలగిల కొట్టుకోవాల్సిందేనన్నారు. మెదక్ పార్లమెంట్ సీటు కాంగ్రెస్ కైవసం చేసుకుంటుందన్నారు. ఇక మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు మాట్లాడుతూ.. బీసీలకు కాంగ్రెస్ మాత్రమే అవకాశం కల్పిస్తుందన్నారు. ఈ సారి మెదక్‌లో ఎగిరేది కాంగ్రెస్ జెండాయేనని అన్నారు. ఇందిరా గాంధీ ప్రాతినిధ్యం వహించిన మెదక్ పార్లమెంట్ స్థానాన్ని కాంగ్రెస్ గెలుస్తుందన్నారు .

# 14న మంత్రి పొన్నం దీక్ష.. ఎందుకోసమంటే?

**హైదరాబాద్, ఏప్రిల్ 12:** మంత్రి పొన్నం ప్రభాకర్ దీక్షకు పూనుకున్నారు. ఏప్రిల్ 14న దీక్ష చేపట్టాలని నిర్ణయించారు. బీజేపీ , బీఆర్ఎస్ వైఫల్యాలపై పొన్నం దీక్ష చేయాలని నిర్ణయించారు. కరీంనగర్ కాంగ్రెస్ కార్యాలయంలో దీక్షకు దిగనున్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం మీడియాతో మాట్లాడుతూ.. నిరుద్యోగ భృతి, డబుల్ బెడ్ రూం ఇచ్చిన వాళ్ళనే బీఆర్ఎస్ ఓట్లు అడగాలని అన్నారు. "మాకు ఒక్క వేలు చూపిస్తే.. మేం నాలుగు వేళ్ళు చూపెడుతాం" అని అన్నారు. పదేండ్లు మంత్రిగా ఉన్న హరీష్ రావు బుద్ధి ఉండే మాట్లాడుతున్నాడా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ ఏర్పడడంపై మోదీ అవహేళన చేశారని.. తెలంగాణ అమరులను ప్రధాని అవమానించారని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు.

తెలంగాణలో ఓట్లు అడగడానికి మోదీకి ఏం హక్కు ఎక్కడిదని ప్రశ్నించారు. " తెలంగాణకు బీజేపీ చేసిందేంటి? కొత్త రాష్ట్రానికి పదేండ్లలో బీజేపీ ఇచ్చిందేంటి? దేశాన్ని అదాని, అంబానీకి అమ్మడం తప్పా మోదీ ఏం చేశారు? బీజేపీని వ్యతిరేకిస్తే ఈడీ, సీబీఐలతో ఇబ్బంది పెడుతున్నారు. రాముడి ఫోటో పక్కన మోదీ ఫోటో ఎలా పెడుతారు. అభివృద్ధి ఏం చేశారని అడిగితే అది పక్కన పెట్టి గాలి కబుర్లు, సొల్లు కబుర్లు చెబుతున్నారు" అంటూ విరుచుకుపడ్డారు. రాముడిని రాజకీయాల కోసం వాడుకోవడం తప్పన్నారు. సికింద్రాబాద్‌కు తెలంగాణ బీజేపీ అధినేత కిషన్ రెడ్డి ఏం చేశారని నిలదీశారు. చేనేత కార్మికులకు బీజేపీ అన్యాయం చేసిందని అన్నారు.

ప్రకృతి వైపరీత్యాలకు నార్త్ ఇండియాలో ఎలా ఆదుకుంటున్నారో సౌత్ ఇండియాలో కూడా అలాగే ఆదుకోవాలని డిమాండ్ చేశారు. "మిషన్ కాకతీయ నీళ్ళు మొత్తం ఎటు పోయాయి? మేం తాగినమా, మీరు తాగారా?" అంటూ ప్రశ్నలు సంధించారు.



గుర్తింపు కోసమే కొందరు బీజేపీ నాయకులు కాంగ్రెస్ మంత్రులపై ఆరోపణలు చేస్తున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.



## సమంత గ్లామ్ ఫోటోలు వైరల్..

సమంత రుత్ ప్రభు సినిమాలు ఏమీ కొత్తగా ఒప్పుకోలేదు కానీ, సామాజిక మాధ్యమాల్లో మాత్రం చాలా చురుకుగా వుంటున్నారు. కొత్త కొత్త ఫోటో షూట్స్ చేసి అవి తన అభిమానులకోసం తన సామాజిక మాధ్యమాల్లో షేర్ చేసి చూపిస్తున్నారు. ఇప్పుడు తాజాగా అందంగా, గ్లామర్ గా కనపడే ఫోటోలు షేర్ చేశారు సమంత. ఇవి ఇప్పుడు ఎక్కడ చూసినా వైరల్ అవుతూ కనిపిస్తున్నాయి. సమంత తాజాగా పోస్ట్ చేసిన ఈ ఫోటోలకి 'ఇట్స్ ఫ్యాషన్ బేబీ' అంటూ ఒక మూడు మాటలు కూడా రాశారు. తాజాగా సమంత నటించిన 'సిటాడెల్: హనీ బన్నీ' అనే వెబ్ సిరీస్ త్వరలోనే అమెజాన్ ప్రైమ్ వీడియోలో స్ట్రీమింగ్ అవనుంది అని తెలుస్తోంది. మరి ఇది ఎంతవరకు నిజమో తెలియదు.

### పొరపాటున కూడా

# అలా చేయొద్దు..



సిద్ధిపేట : రాష్ట్రంలో మళ్లీ వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమే. మనం పదేళ్లు పాలించినం..వాళ్లు వచ్చి నాలుగు నెలలు కాలేదు. ప్రభుత్వంపై అప్పుడే వ్యతిరేకత పెరిగింది. కాంగ్రెస్ , మీద కోపంతో బీజేపీకి ఓటేస్తే పెనం నుంచి పొయ్యిలో పడ్డట్టు అయితదని మాజీ మంత్రి హరీశ్ రావు హెచ్చరించారు. మెదక్ పార్లమెంట్ ఎన్నికలపై శుక్రవారం కొండ భూదేవి గార్డెన్‌లో సిద్ధిపేట పట్టణ బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం నిర్వహించారు.

ఈ సమావేశంలో హరీశ్ రావు పాల్గొని మాట్లాడారు. సిద్ధిపేటలో సగం కట్టిన వెటర్నరీ కాలేజీని రద్దు చేసి సీఎం రేవంత్ రెడ్డి కొడంగల్‌కు తరలించుకు పోయాడని ఆరోపించారు.వంద రోజుల్లో ఆరు గ్యారంటీలు అని గంభీర ఉపన్యాసాలు ఇచ్చారు. ఇప్పుడు సన్నాయి నొక్కులు నొక్కుతున్నారు. రేవంత్ రెడ్డి దగ్గర సరుకు లేదు, పని లేదని విమర్శించారు. బీజేపీ పేదలకు, తెలంగాణకు వ్యతిరేక పార్టీ.

బీఆర్ఎస్‌ను ఖతం చేయాలనే కుట్ర..

సిలేరును లాక్కుని మనకు అన్యాయం చేసిన పార్టీ అని గుర్తు చేశారు. పదేళ్లలోబీజేపీ చేసిన ఒక్క మంచి పని ఉందా? అని సూటిగా ప్రశ్నించారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్, బీజేపీ ఒక్కటే అని రేవంత్ రెడ్డి బురదజచ ల్లిండ్లు.. ఇప్పుడు మోదీని బడేమియా అంటుంటున్నడని మండిపడ్డారు. కాంగ్రెస్, బీజేపీ ఒక్కటై తెలంగాణలో బీఅర్ఎస్ లేకుండా చేయాలనే కుట్రలు పన్నుతున్నారని విమర్శించారు.


ప్రత్యర్థుల తప్పుడు ప్రచారాలను సోషల్ మీడియా వేదికగా కార్యకర్తలు తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. బీజేపీని ఓడించే శక్తి బీఆర్ఎస్‌కే ఉందని ముస్లిం సోదరులు గుర్తించాలి. ఇచ్చిన హామీలు తప్పిన కాంగ్రెస్ మెడలు వంచాలంటే ఎంపీ ఎన్నికల్లో బీఅర్ఎస్ పార్టీని గెలిపించాలన్నారు.

## మంత్రి శ్రీధర్ బాబు ఇలాకాలో నీళ్లు లేక జనం విలవిల



హైదరాబాద్ : కాంగ్రెస్ వచ్చింది కరువును తెచ్చింది అనే మాట రాష్ట్రంలో రోజు ఏదో ఒక చోట నిరూపితమవుతూనే ఉంది. రేవంత్ రెడ్డి పాలనలో అన్ని వర్గాల ప్రజలు సాగు, తాగు నీళ్ల కోసం అరిగోస పడుతున్నారు. తాజాగా మంత్రి శ్రీధర్ బాబు ప్రాతినిధ్యం వహిస్తున్న మంథని నియోజకవర్గంలో పది రోజులుగా మిషన్ భగీరథ నీరు రావడం లేదని మహిళలు ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. భూపాలపల్లి – కాటారం మండలంలోని ఇబ్రహీంపల్లి గ్రామ ఎస్సీ కాలనీ మహిళలు గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట ఖాళీ బిందెలతో బైఠాయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పది రోజులుగా తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నామన్నారు. అధికారులు, నాయకుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు వెంటనే స్పందించి ట్యాంకర్లతో నైనా తాగునీరు సరఫరా చేయాలని డిమాండ్ చేశారు.

## రేవంత్ రెడ్డి మైక్ వీరుడు.. కేటీఆర్ వ్యంగ్యాస్త్రాలు




**రంగారెడ్డి :** తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి మైక్ వీరుడంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. మైక్ పట్టుకుంటే ఆయనకు పూనకం వచ్చి.. ఏది పడితే అది మాట్లాడుతాడు అని పేర్కొన్నారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన భువనగిరి పార్లమెంట్ విస్తృతస్థాయి సమావేశంలో కేటీఆర్ పాల్గొని ప్రసంగించారు. కాంగ్రెస్, బీజేపోళ్లకు భయపడే పరిస్థితి లేదు. రేవంత్ రెడ్డి మైక్ వీరుడు. మైకు పట్టుకుంటే ఆయనకు పూనకం వస్తుంది.ఏది పడితే అది మాట్లాడు తాడు. ఇప్పుడిప్పుడే ప్రజలకు వాస్తవాలు తెలుస్తున్నాయి. అసెంబ్లీ ఎన్నికల్లో అర చేతిలో వైకుంఠం చూపెట్టారు కాం గ్రెసోళ్లు. రియల్ ఎస్టేట్ అంటే రేవంత్ రెడ్డి.. రేవంత్ రెడ్డి అంటే రియల్ ఎస్టేట్ అన్నాడు. ఇవాళ రంగారెడ్డి జిల్లాలో రియల్ ఎస్టేట్ పరిస్థితి ఏమైంది..? రియల్ ఎస్టేట్ పడిపోవడానికి కారణం ప్రభుత్వానికి తెలివి అవగాహన లేకపోవడమే. ఇక్కడ ఫార్మా సిటీ పెట్టాలని రైతులకు మంచి పరిహారం ఇచ్చి భూసేకరణ చేశాం. అనుమతులు కూడా తెచ్చాం. ఆ కంపెనీలకు జాగ ఇచ్చి లక్షల మందికి కొలువులు తెచ్చే ఫార్మా సిటీని నడుపుకునే తెలివి లేని సన్నాసులు కాంగ్రెస్ నాయకులు. కంపెనీలు, ఫ్యాక్టరీలు, యూనివర్సిటీలు, కాలేజీలు వస్తే రియల్ ఎస్టేట్ ఊపందుకుంటుంది. ఫాక్స్‌కాన్ తెప్పించాం.. మే నెలలో ప్రారంభం కావాల్సిన ప్రాజెక్టు. కానీ ఇప్పటికీ ప్రారంభం కాలేదు అని కేటీఆర్ తెలిపారు.పార్లమెంట్ ఎన్నికల తర్వాత అన్ని పథకాలకు మంగళం.. పార్లమెంట్ ఎన్నికలు ముగిసిన తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన అన్ని పథకాలకు రేవంత్ రెడ్డి మంగళం పాడుతారని కేటీఆర్ పేర్కొన్నారు. ఈ వంద రోజుల్లో ఫ్రీ బస్సు ఒక్కటే స్టార్ట్ చేసిండు. పార్లమెంట్ ఎన్నికల తర్వాత ఫ్రీ బస్సుకు మంగళం పాడుతాడు. ఈ పథకం వల్ల ఆర్టీసీకి రూ. 1400 కోట్ల నష్టం వచ్చింది. తులం బంగారం అనగానే మహిళలు సెంటిమెంట్‌కు పడిపోయి ఓట్లు వేశారు. కానీ తులం బంగారం ఇవ్వడం లేదు. ఈ విషయాలను వివరంగా చెప్పాలి అని కేటీఆర్ సూచించారు.

## భద్రాచలంలో శ్రీరామ నవమికి..
## ఆన్‌లైన్‌లో రూమ్స్ బుకింగ్ షురూ



ప్రతి ఏటా అంగరంగ వైభవంగా నిర్వహించే రాములోరి బ్రహ్మోత్సవాలు మళ్లీ మొదలయ్యాయి. తెలంగాణ భద్రాచలంలోని రాములోరి ఆలయంలో శ్రీరామనవమి తిరు కల్యాణ బ్రహ్మోత్సవాలు ఏప్రిల్ 9 నుంచి ప్రారంభమయ్యాయి. ఇవి ఏప్రిల్ 23 వరకు కొనసాగనున్నాయి. ఈ క్రమంలోనే ఏప్రిల్ 17న శ్రీరామనవమి వేడుక జరగనుంది. ఈ నేపథ్యంలో లక్షలాది మంది భక్తులు ఈ వేడుకల కోసం తరలిరానున్నాయి. ఇప్పటికే భక్తుల కోసం చలువ పందిళ్లను ఏర్పాటు చేశారు. దీంతోపాటు ఆలయ పరిసరాలలో తాగు నీరు సహా భక్తుల కోసం గదులనుకూడా సిద్ధం చేశారు.

ఈ క్రమంలో భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో జరిగే శ్రీరామనవమి, మహా పట్టాభిషేక ఉత్సవాలకు హాజరయ్యే భక్తులు ఆన్‌లైన్ లో కూడా గదులు బుక్ చేసుకోవచ్చని అధికారులు ప్రకటించారు. అందుకోసం ఈ వెబ్‌సైట్ ద్వారా https: //book.bhadrachalam-online.com/book-hotel బుక్ చేసుకోవచ్చని అధికారులు సూచించారు. ఏప్రిల్ 17, 18 తేదీలలో ఎక్కువ మంది భక్తులు వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లు చేశామని అక్కడి అధికారులు స్పష్టం చేశారు. అయితే ఆయా తేదీలలో రూమ్స్ కోసం ముందుగానే బుక్ చేసుకుంటే సులభంగా దొరికే అవకాశం ఉంటుంది. రూముల గురించి మరింత సమాచారం కోసం వెబ్‌సైట్ క్లిక్ చేయండి.

## మహిళ కాళ్లపై ..




వరంగల్ : హనుమకొండ జిల్లాలో దారుణం చోటు చేసుకుంది. ఓ మహిళ కాళ్లపై నుంచి ఆర్టీసీ బస్సు దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో మహిళ రెండు కాళ్లు విరిగిపోయాయి . ఈ విషాదకర సంఘటన శుక్రవారం హనుమకొండ బస్టాండ్‌లో చోటు చేసుకుంది. ప్రమాదానికి గురైన మహిళ హనుమకొండ జిల్లా శాయంపేట మండలం పత్తిపాకకు చెందిన కావటి రాజక్క (48)గా గుర్తించారు. గుర్తించిన స్థానికులు వెంటనే ఆమెను దవాఖానకు తరలించి పోలీసులకు సమాచారమిచ్చారు. సంఘటన స్థలానికి చేరుకున్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రమాదానికి సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.


## సాయికృష్ణ రైస్‌మిల్ యజమానిపై నాన్ బెయిలబుల్ కేసు నమోదు

**నారాయణపేట :** ప్రభుత్వం నిర్ణయించిన మేరకు సీఎంఆర్ బియ్యం ప్రభుత్వానికి అందజేయని ఓ రైస్‌మిల్ యజమానిపై నాన్ బెయిలబుల్ కేసు నమోదు చేసినట్లు నారాయణపేట జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. నారాయణపేట జిల్లా ధన్వాడ మండల పరిధిలోని కొండాపూర్ గ్రామంలో గల సాయికృష్ణ రైస్ మిల్‌ను ఇటీవలే జిల్లా కలెక్టర్ శ్రీహర్ష జిల్లా అదనపు ( రెవెన్యూ) కలెక్టర్ అశోక్ కుమార్‌తో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు.

ఈ తనిఖీలో రైస్ మిల్ యజమాని రాజేందర్ రెడ్డి ప్రభుత్వానికి అందజేయాల్సిన 1.8 కోట్ల విలువగల సీఎంఆర్ బియ్యాన్ని పక్కదారి పట్టించినట్లు కలెక్టర్ గుర్తించారు. దీనిపై జిల్లా కలెక్టర్ రైస్ మిల్ యజమానిపై ధన్వాడ పోలీస్ స్టేషన్‌లో సివిల్ సప్లై డీఎం దేవన్‌తో ఫిర్యాదు చేయించారు.

ఈ మేరకు ధన్వాడ పోలీసులు రైస్‌మిల్ యజమాని రాజేందర్ రెడ్డి పై ఎఫ్ఐఆర్ చేసి నాన్ బైలబుల్ కేసు నమోదు చేసినట్టు కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని మిల్లర్లు ప్రభుత్వానికి నిర్దేశించిన మేర సీఎంఆర్ బియ్యం సరఫరా చేయకుండా పక్కదారి పట్టించినట్లు రుజువైతే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. రైస్ మిల్లర్లు సీఎంఆర్ డెలివరీలను వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

### రాహుల్ ప్రధాని అవుతారని
# కాంగ్రెస్ రిఫరెండంగా ప్రకటిస్తారా..!



**హైదరాబాద్, ఏప్రిల్ 12:** అధికార కాంగ్రెస్ పార్టీ అభద్రతా భావంలో ఉందని బీజేపీ ఎంపీ లక్ష్మణ్ అన్నారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలపై ప్రజల నుంచి వ్యతిరేకత పెరుగుతోందన్నారు. కరువు, నీళ్లు అందక పంటలు ఎండిపోతున్నాయని తెలిపారు. సానుభూతి కోసం తనపై కుట్రలు జరుగురున్నాయని.. రేవంత్ రెడ్డి కొత్త నినాదం ఎత్తుకున్నారని మండిపడ్డారు. మజ్లిస్‌ను గెలిపించమని రేవంత్ రెడ్డి చెప్పారని కాంగ్రెస్ నాయకులే బాహాటంగా చెబుతున్నారన్నారు.

మజ్లీస్‌కు సపోర్ట్ చెయ్యడం హనుమంతరావు లాంటి వ్యక్తులకు ఇష్టం లేదన్నారు. సొంత నేతల వలనే కాంగ్రెస్ ప్రభుత్వం పడిపోతుందంటూ వ్యాఖ్యలు చేశారు. అవినీతి పార్టీలకు కొమ్ము కాసే వ్యక్తులు జైళ్లలో ఉన్నారన్నారు. హామీల విషయంలో బీఆర్ఎస్‌కు పట్టిన గతే కాంగ్రెస్‌కు పడుతుందని హెచ్చరించారు. అబద్ధాలకు కాంగ్రెస్, అహంకారనికి బీఆర్ఎస్‌లు మారుపేరు అంటూ విమర్శలు గుప్పించారు. తనపై, తన ప్రభుత్వంపై కుట్ర జరుగుతుందని ప్రజలను మభ్య పెడుతున్నారన్నారు. రాహుల్ గాంధీ ప్రధాన మంత్రి అవుతారని కాంగ్రెస్ రిఫరెండంగా ప్రకటిస్తారా..! అని బీజేపీ ఎంపీ లక్ష్మణ్ ప్రశ్నించారు.

## తాగునీటి, ధాన్యం కొనుగోళ్లు పై సీఎం సమీక్ష

హైదరాబాద్ : తాగునీటి సరఫరా , ధాన్యం కొనుగోళ్లపై సీఎం రేవంత్ రెడ్డి మధ్యాహ్నం 2 గంటలకు డా.బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో సమీక్షించనున్నారు . ధాన్యం కొనుగోలు కేంద్రాలు, వడ్లకు కనీస మద్దతు ధర, రైతుల నుంచి వస్తున్న ఫిర్యాదులపై సమావేశంలో చర్చిస్తారు. అలాగే వేసవిలో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా తీసుకోవాల్సిన చర్యలపై సీఎం అధికారులతో చర్చిస్తారు.

### ఫొటో జర్నలిస్టు నర్రా రాజేష్ కుటుంబానికి
# అండగా ఉంటాం : కె శ్రీనివాస్ రెడ్డి

ఆయా పత్రికల్లో ఫోటో జర్నలిస్టుగా సేవలందించిన రాజేష్, ఎంతో బాధ్యతగా తన కర్తవ్యాన్ని నిర్వర్తించాడని ఆయన కొనియాడారు. మీడియాకు ఫొటో జర్నలిస్టులు కళ్ళు, చెవుల లాంటి వారన్నారు. పత్రికల్లో వార్తలకు సాక్ష్యంగా నిలిచేది ఫొటోలేనని, ఆ ఫొటోల కోసం ఫొటో జర్నలిస్టులు పడే తిప్పలు వర్ణనాతీతమని శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. పాత్రికేయ వృత్తి అభద్రతా, అత్యంత ప్రమాదకరమైనట్లు ప్రజాస్వామిక దేశాలకు ఐక్యరాజ్య సమితి ఎప్పుడో సూచించిందని ఆయన గుర్తుచేశారు. ఫొటో, వీడియో జర్నలిస్టుల ఆరోగ్య భద్రత పై మీడియా సంస్థల యాజమాన్యాలు దృష్టి సారించాలని ఆయన సూచించారు.

తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె విరాహత్ అలీ మాట్లాడుతూ.. ప్రాణాలను ఫణంగా పెట్టి మీడియా రంగంలో వృత్తి బాధ్యతలు నిర్వహిస్తున్న ఫోటో, వీడియో జర్నలిస్టుల జీవితాలు అంధకారంలో మగ్గుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా తెలంగాణ ఉద్యమంలో లాఠీలను, తూటాలను, కేసులను లెక్కజేయకుండా ఫోటో జర్నలిస్టులు పోషించిన సాహసవంతమైన పాత్ర అభినందనీయమన్నారు. ఫోటో, వీడియో జర్నలిస్టుల సంక్షేమం, హక్కుల పరిరక్షణ కోసం తమ సంఘం నాటి నుండి నేటివరకు అహర్నిశలు కృషి చేస్తుందన్నారు. ఎప్పుడూ చిరునవ్వులతో పలకరించే రాజేష్ ఆకస్మిక మృతి తమను ఎంతో కలచివేసిందని, అతని కుటుంబానికి చేయూతనిస్తామని విరాహత్ అన్నారు.

హెచ్‌యూజే అధ్యక్షుడు శిగా శంకర్ గౌడ్ మాట్లాడుతూ.. రాజేష్ మృతితో తమ సంఘం క్రియాశీలక సభ్యుడిని కోల్పోయిందన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ స్టేట్ ఫోటో జర్నలిస్ట్స్ అసోసియేషన్ అధ్యక్షులు గంగాధర్, ప్రధాన కార్యదర్శి హరి, జేఎన్‌జేహెచ్ఎస్ అధ్యక్షులు బి.కిరణ్ కుమార్, రాజేష్ భార్య లావణ్యతో పాటు ఫోటో జర్నలిస్టులు పాల్గొన్నారు.